# తిరస్కారం

నెలల పసికందును అపురూపంగా పట్టుకుని జాగ్రత్తగా రైలు దిగింది జయంతి.
ముందురోజు రాత్రి రైలు ఎక్కినప్పటినుండీ ఏకధాటిగా ఏడుస్తూనే వుందనడానికి నిదర్శనగా ఆమెకళ్ళు ఎర్రగా వాచి వున్నాయి.
బరువయిన సూట్ కేసును కూలీ చేత మోయించుకుంటూ బయటికి వచ్చి రిక్షా మాట్లాడుకుంది. పెళ్ళయ్యాక కాపురానికి వెళ్ళేటపుడు అందరూ యిదే స్టేషనుకు వచ్చి సాగనంపారామెను.
"మళ్ళీ యిపుడు.. రెండేళ్ళ తర్వాత.. పుట్టింటికి తిరిగి వస్తోంది.. బహుశా శాశ్వతంగా."
జయంతి వులిక్కిపడింది ఆ ఆలోచనకి. "శాశ్వతంగా వచ్చేస్తోందా తను!"
ఈరెండేళ్ళూ తను గడిపిన జీవితం గుర్తు రాగానే, నిలువెల్లా వణికిపోతూ.. వడిలోని పిల్లాడిని గట్టిగా గుండెలకి అదుముకుంది.
కాపురానికి వెళ్ళేటపుడు ఎన్ని కలలతో వెళ్ళింది! ఎన్నోరోజులు పట్టలేదు ఆ కలలు కన్నీళ్ళవడానికి.
అతని మాటలు.. ఆ శాడిజం.. రెండేళ్ళ చిత్రహింస.. "భగవంతుడా! పగవాళ్ళకి కూడా వద్దు." తల వెనక్కి వాల్చి కళ్ళు గట్టిగా మూసుకుంది.
గుండెల్లో దుఃఖం సముద్రంలా పొంగుతోంది. దాన్ని గొంతుకి అవతలే బంధించే ప్రయత్నంలో శరీరం సన్నగా వణుకుతోంది.
"ఏం పాపం చేసిందని తనకీ శిక్ష! ఎందుకింతగా పరీక్షించాడు భగవంతుడు తనని!" అసహాయంగా అనుకుంది జయంతి.
"తనకు తెలిసి తానే పాపమూ చేయలేదు. ఏ తప్పూ చేయలేదు. సుందర్ ని ప్రేమించడం తప్ప తనే పొరపాటూ చేయలేదు."
అవును. ప్రేమించింది. సుందర్ ని ప్రేమించింది.
ఆ ఆలోచనే ఆమెకి చిత్రంగా తోస్తోంది. రెండేళ్ళ క్రితం సుందర్ ని తను ప్రే..మిం..చి.. పెళ్లి చేసుకుంది!!
ఎలావుండేది తను ఆ రోజుల్లో!
అప్పటి తన రూపం కళ్ళముందు మెదిలి జయంతి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

జలపాతంలా వుండేది. ఆమె ఎక్కడ వుంటే అక్కడ సందడి. ఇంట్లో.. ఆఫీస్ లో..
జయంతి పేరు వింటే చాలు ఒక ఉత్సాహతరంగం ఎగసి పడేది.
అలాంటి తను.. మొట్టమొదటిసారి అతన్ని చూసినపుడే మూగగా మారిపోవడం ఆమెకి
గుర్తొచ్చింది.
ఆరోజు.. ఆఫీస్ లో ఏదో వర్క్ చేసుకుంటూండగా బాస్ నుంచి పిలుపొచ్చింది.
జయంతి లేచి ఆయన కాబిన్ లోకి వెళ్ళింది.
"కూర్చోమ్మా! హి యీజ్ సుందర్." అంటూ అతన్ని పరిచయం చేశాడాయన.
కాలుమీద కాలు వేసుకుని చాలా హాయిగా కూర్చున్న అతన్ని రెప్పపాటులో
గమనిస్తూ విష్ చేసింది జయంతి.
"బెంగుళూర్ నుంచి వచ్చారు. మంచి నాలెడ్జ్, ఎక్స్ పీరియన్స్ వున్న యింజినీర్."
బాస్ పరిచయం చేసి వెళ్ళిపోయాక జయంతి అతనితో చాలాసేపు మాట్లాడింది.
ఫ్యాక్టరీ అంతా చూపించింది. కొత్త టెక్నాలజీస్ గురించి చర్చించింది. ఆమె అందాన్ని,
ఉత్సాహాన్ని, తెలివితేటలనీ అబ్బురంగా చూశాడు సుందర్. పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు.
ఆమెకేమీ అభ్యంతరం కనపడలేదు. గొప్ప యింజినీర్. అందగాడు.
పెద్దవాళ్ళతో మాట్లాడమని చెప్పింది.
మర్నాడే వచ్చాడు. నెల్నాళ్ళలో పెళ్ళయ్యింది. జయంతి వుద్యోగం వదిలేసి అతనితో
బెంగుళూర్ వెళ్ళిపోయింది.
అదిగో.. అప్పట్నుంచే మొదలయిందీ నరకం.
కిరసనాయిల్ పోసి తగలపెట్టడాలూ.. వాతలు తేలేలా కొట్టడాలూ లేవు. చిన్న
మాటలు.. చాలా చిన్న చిన్న మాటలు ఉపయోగించి హృదయాన్ని ఛిద్రం చేయడంలో
సుందర్ సిద్ధహస్తుడు.
ఆమెకు అతనిమీద వెర్రిప్రేమ వుండేది. తనని ప్రేమించి పెళ్ళిచేసుకున్నాడని కాదు. తన
మెడలో మంగళసూత్రం ముడివేసిన స్నేహితుడని. తాను సీత అయితే.. అతను
రాముడని. అవును. ఆ బంధం మీద అమితమయిన గౌరవమూ, ఆ వ్యక్తి మీద అంతులేని
ప్రేమా వుండేవి ఆమెకి. బోలెడంత సున్నితత్వమూ, అంతకు మించిన సామర్ధ్యమూ
వుండేవి. అందరికీ తాము ఆదర్శంగా వుండాలన్న తపన వుండేది.
సుందర్ కి వాటిల్లో ఒక్కటీ నచ్చలేదు. నచ్చలేదా! మరి ఆ సమర్ధత చూసేగా పెళ్ళి
చేసుకున్నాడు! కాదు. నచ్చకపోవడం కాదు. భరించలేకపోవడం.

పెళ్ళికి ముందు ఆమెకి గొప్ప నమ్మకం వుండేది. తాను చాలా బాగా మాట్లాడగలనని. నమ్మకమేముంది! నిజం. కొన్ని వందలమంది ఒప్పుకున్న నిజం. కానీ సుందర్ ఒప్పుకోలేదు. ఆమె మాట్లాడటం మొదలుపెట్టిన మరుక్షణం అతని ఎగతాళి ప్రారంభమయ్యేది.

"నీకసలు మాట్లాడటం రాదు. నీకు మనుషులతో కలవడం రాదు." అనేవాడు.

దాదాపు పదినెలలు.. మాట్లాడిన ప్రతీ మాటకీ విమర్శలు ఎదుర్కొన్నాక ఆమెకు నిజమేననిపించడం మొదలుపెట్టింది. "నిజంగా నాకు మాట్లాడటం రాదా!" అనుకునేది.

"..ఏవండీ! ఇవాళ ప్రక్కింటావిడ ఏమందంటే.." అంటూ ఆమె మొదలు పెట్టగానే సుందర్ కళ్ళు విప్పార్చి చూసేవాడు.

"ఏవిటీ! ఆవిడ నీతో మాట్లాడిందా! నీకు మనుషులతో మాట్లాడటం కూడా వచ్చా!" అనేవాడు.

ఉత్సాహం అంతా నీరు కారిపోగా జయంతి తలవంచుకుని వెళ్ళిపోయేది.

ప్రక్కింటి వాళ్ళతో.. ఎదురింటి వాళ్ళతో.. మాట్లాడటం నేరం! నేరం అంటే మళ్ళీ ఆ నేరానికి పెద్ద పెద్ద శిక్షలేమీ వుండవు. చాలా చిన్న చిన్న మాటలే గురిగా వచ్చి హృదయాన్ని గుచ్చుతాయి.

అతను వచ్చేసరికి ప్రక్కింటావిడతో మాట్లాడుతూ కనిపిస్తే చాలు, "..ఏంటీ!.. ఆంటీతో కబుర్లెక్కువయ్యాయి ఈ మధ్య!" అంటాడు కళ్ళలోనూ వంకర నవ్వులోనూ బోలెడంత వ్యాఖ్యానం నింపి.

ఆ ఎగతాళి చూసినపుడు తనని తాను నరికేసుకోవాలనిపించేది జయంతికి. "ఎందుకితను ఒక్కసారి కూడా తనవైపు ప్రేమగా చూడడు! తను ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్త.. తన సర్వస్వం అనుకున్న వ్యక్తి.. అనుక్షణం అపహాస్యం తప్ప మరేమీ కనపడనియడెందుకు కళ్ళల్లో!"

ఎవరితోనూ చెప్పుకోలేదు జయంతి. చెప్తే అర్థం చేసుకోగలిగినంత పెద్ద సమస్యలు కావివి. అందుకే మౌనాన్ని ఆశ్రయించింది.

సంవత్సరం తర్వాత.. "పోనీ ఉద్యోగం చేస్తే!" అన్న ఆలోచన వచ్చింది. అప్లికేషన్ పెడుతూంటే సుందర్ వద్దనలేదు. ఎప్పటిలాగే ఎగతాళి చేశాడు. "నువు వుద్యోగానికేం పనికొస్తావు!" అన్నాడు.

"ఉద్యోగానికి పనికిరాదా! .. తను ఉద్యోగానికి పనికిరాదా!" .. జయంతికి పెద్దపెట్టున ఏడవాలనిపించింది.
కానీ కాల్ లెటర్ వచ్చిన రోజు ఆమెలో మళ్ళీ ఉత్సాహం నిండింది. ఇంటర్వ్యూ బ్రహ్మాండంగా చేసి యింటికొచ్చాక.. మొహంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది. సుందర్ రాగానే ఆనందంగా ఎదురు వెళ్ళింది. "..ఏమిటంత ఆనందం!" అన్నాడు సుందర్ నవ్వుతూ.
న.. వ్వు.. తూ.. నే!
ఎదుటివాళ్ళని ఏడిపించేటంతటి గొప్పనవ్వు.. ఒక్క సుందర్ కే తెలుసేమో బహుశా!
జయంతికి గొంతు పెగలలేదు. అయినా ఎలగో చెప్పింది అన్ని కబుర్లూ.
అంతా విన్నాక సుందర్ అన్నాడు. "అపుడే ఉద్యోగం వచ్చినట్లు సంబర పడుతున్నావేమిటి! ఇంకా ఇంటర్వ్యూనే అయింది. ఇందిరాగాంధీలా ఫీలయ్యిపోకు." అదికూడా నవ్వుతూనే అన్నాడు సరదాగా.
ఒకటే ఊపిరిగా బ్రతికే మనిషి యిర్వై నాలుగు గంటలూ.. జీవితాంతమూ.. సరదాగా మాట్లాడటం కంటే కావలసింది ఏముంది!
ఒక్కసారి.. ఒక్కసారికూడా సీరియస్ గా మాట్లాడకపోవడంలో సమస్య ఏముంది!
జయంతి వెక్కి వెక్కి ఏడ్చిందారోజున.
చివరికి తనే తెప్పరిల్లింది. "ఏమిటిది! ఇంత చిన్న విషయానికి బాధపడటమేమిటి!" అనుకుని వెళ్ళి అతన్ని పలకరించింది.
అతను నవ్వుతూ దగ్గరికి తీసుకున్నాడు. విజయగర్వం నిండిన ఆ నవ్వుని విశ్లేషించే ప్రయత్నం చేయలేదు జయంతి.
ఆమె బలహీనతని మాత్రం అతను కరెక్ట్ గా అర్థం చేసుకున్నాడు. తనను వదిలిపెట్టి వుండలేని ఆమెప్రేమని ఉపయోగించుకోకూడనంతగా వుపయోగించుకున్నాడు.
రోజురోజుకీ, గంటగంటకీ ఆమెని మాటలతో బలహీనపరిచాడు.
పెళ్ళయిన సంవత్సరానికే జీవచ్ఛవంలా తయారయింది జయంతి. బిడ్డని చూసుకుని కూడా పెద్దగా ఆనందపడలేదు.
"..ఏవిటీ! నీకొక్కదానికే కొడుకున్నట్లు మురిసిపోతున్నావూ..!" అంటాడేమో సుందర్! .. అన్న భయంతో.. కనీసం హాయిగా నవ్వలేదు.

ప్రతి సున్నితమయిన ఫీలింగ్ నీ గుండెకి అవతలే దాచేసుకోవడం నేర్చుకుంది.

చాలారోజుల తర్వాత వచ్చిన తమ్ముడు ఆశ్చర్యంగా చూశాడు. "ఏంటక్కా! ఇలా అయిపోయావు!" అన్నాడు.

మేనల్లుడిని ఎత్తుకుని ముద్దాడాడు. జోకులు వేశాడు. "అక్కా! నాకేం చేసి పెడ్తావు!" అని హడావుడి చేశాడు.

జయంతి హుషారు తెచ్చుకుని వంట చేసింది. లొట్టలు వేస్తూ తింటున్న తమ్ముడికి కొసరి - కొసరి వడ్డిస్తూంటే.. సోఫాలో కూర్చున్న సుందర్ ఒక్కక్షణం తదేకంగా చూశాడు. తర్వాత టి.వి. వైపు తలత్రిప్పుతూ, రిమోట్ తో ఛానల్స్ అటూ యిటూ మారుస్తూ చాలా సాధారణంగా అన్నాడు... ఆమెకి మాత్రమే వినపడేలా!

"మీ నాన్నని ఒక బస్తా బియ్యం పంపించమని చెప్పు... మీ తమ్ముడు వచ్చినప్పుడల్లా."

అతని ప్రక్కనుంచీ వంటగదిలోకి వెళ్తున్న జయంతి నిర్విణ్ణురాలయింది. అసంకల్పితంగా తమ్ముడికోసం చూసింది. అతను అప్పటికే బయటికి వెళ్ళిపోవడం గమనించి చిన్నగా నిట్టూర్చింది.

ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఎంత ఘోరం! తన స్వంత తమ్ముడికి తన చేతుల్తో ఒక ముద్ద అన్నం పెట్టే అవకాశం లేదా!"

ఆరోజున ఆమెకి అర్థమయింది.

ప్రేమించడం అంటే అందానికి ఆకర్షితులవడం కాదు. "పిల్ల బాగుంది కదా!" అని పెళ్ళి చేసుకోవడం కాదు.

ప్రేమ అనేది ఒక విశేషణం కాదు. ఒక లక్షణం కాదు.

ప్రేమంటే.. ఒక మనిషితో మనం ప్రవర్తించే పద్ధతి., మాట్లాడే తీరు. ఆమనిషి అలవాట్లతో మన మనసుని అనుసంధానం చేసుకోగల నేర్పు!

..ఆతర్వాత అక్కడ ఎందుకు వుండాలో జయంతికి అర్థం కాలేదు.

"వ్యక్తిగా తనపట్ల గౌరవం లేదు. భార్యగా తనతో సామరస్యమయిన మాటలూ.. సంప్రదింపులూ లేవు. అన్నిటికన్నా ముఖ్యంగా.. అన్నిటికన్నా ముఖ్యంగా అతనికి తనమీద అణువంత ప్రేమ లేదు. ఇంకెందుకిక్కడ వుండడం!"

రోజంతా ఆలోచనలతో పిచ్చెక్కసాగింది జయంతికి. ఎందుకు యిలా చేస్తాడు సుందర్! ఎందుకు! . . ఎందుకు! అన్న ప్రశ్న పదే పదే మనసులో కెరటంలా లేచింది.

ఒక్కసారి తల్లి దగ్గరకి వెళ్ళి. . ఆవిడ వడిలో తలపెట్టుకుని బాధంతా దించుకోవాలనిపించింది. "అవును. అమ్మకి చెప్పుకుంటే కానీ ఈ బాధ తీరదు." జయంతి మనసు తీర్మానించింది.

సూట్ కేస్ సర్దుకుని హైదరాబాద్ ప్రయాణమయింది.

సుందర్ కి ఒక లెటర్ వ్రాసిపెట్టి, ప్రక్కింటావిడకి తాళం చెవులు యిచ్చి రైలెక్కింది.

"కానీ ఈ ప్రయాణపు గమ్యం ఏమిటి! అమ్మ ఏమని చెప్తుంది! తిరిగి సుందర్ దగ్గరికి వెళ్ళమంటుందా. . వద్దంటుందా!"

జయంతి ఆలోచనలలోనుంచి తేరుకోక ముందే రిక్షా ఆగింది.

"అమ్మా! జయంతక్క వచ్చిందే!" అన్న చెల్లెలి అరుపు వినపడింది మొదట.

ఆవెంటనే పరంపరగా ప్రశ్నలు వినిపించాయి.

"ఒక్కదానివే వచ్చావేంటమ్మా!"

"బావగారేరక్కా!

"సుందర్ రాలేదామ్మా!"

ఎవరికీ సమాధానం చెప్పకుండా లోపలికి నడిచింది జయంతి.

"నాల్రోజులు వుందామని వచ్చానమ్మా! . . నేనొక్కదాన్నే." ఆమె మాటలు విని అందరూ సర్దుకున్నారు. సంబరపడుతూ పిల్లాడిని అందుకున్నారు.

మూడురోజులు గడిచాయి. అందరూ ఆనందంగా వున్నారు. కూతురి సంసారాన్ని. . ఆమె భర్త గొప్పదనాన్ని. . వాళ్ళ ప్రేమకి గుర్తుగా కనిపిస్తున్న పండంటి పిల్లాడినీ చూసి మురిసిపోతున్నారు.

కానీ జయంతికే. . జయంతికే బాధని ఎదుర్కోవడం చేతకావడం లేదు. వచ్చేటపుడు తల్లితో చెప్దామనుకుంటూ వచ్చింది కానీ. . యిపుడు చెప్పేందుకేమీ కనపడడం లేదు.

"నా భర్త నన్ను ప్రేమించడం లేదమ్మా!" అని ఎలా చెప్పడం!

జీవితం పరిసమాప్తి అయిపోయినట్లుగా వుందామెకి. "ఎందుకు! ఎలా! ఎవరికోసం!" అనిపిస్తోంది.

అద్దంలో చూసుకుంటే తనకి తనే చాలా క్రొత్తగా కనిపిస్తోంది.

ఆ క్షణం తన రూపాన్ని చూస్తుంటే ఆమెకి "ప్రాణం పోయినా తిరిగి సుందర్ దగ్గరికి వెళ్లద్దు" అనిపిస్తోంది. కానీ ఆ నిర్ణయం అరసెకనులో ఆరోవంతు సేపయినా నిలబడడం లేదు.

"శరీరం కాదు. కనీసం మనసు కూడా మిగలలేదు తనకి! అది యిప్పటికీ సుందర్ మీద ప్రేమని చంపుకోలేక పోతోంది. ఎందుకింత బలహీనమయిపోయింది తను! వెరపు అనేది తెలియని తన కళ్ళు ఎందుకింత చంచలమైనాయి! మనుషుల అలికిడి వింటే చాలు మనసెందుకిలా వణికిపోతోంది! ఒక్క వ్యక్తి.. ఒకే ఒక్క వ్యక్తి.. అతను భర్త అయితే కావచ్చు గాక, అయితే మాత్రం! ఒక్క వ్యక్తి ప్రేమ దొరకనంత మాత్రాన తను యింత బలహీనమయిపోయిందెందుకు!"

దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడవసాగింది జయంతి. తలెత్తి చూస్తే.. టేబిల్ మీది కృష్ణుడి బొమ్మ చిరునవ్వులు చిందించింది.

"కృష్ణుడు ఎంత అదృష్టవంతుడు! ఎంత మంది ఎన్ని రకాలుగా ప్రేమని కురిపించారతని మీద! అందుకేనా అంత అందమయిన నవ్వు అతని స్వంతమయింది!"

జయంతి నిట్టూరుపులో గుండె పగిలిన శబ్దం వినపడింది.

మనస్పూర్తిగా ప్రేమించిన వ్యక్తి ఆ ప్రేమని అందుకోకుండా నిర్లక్ష్యం చేస్తే అది నిజంగా చాలా పెద్ద దెబ్బ.

ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ప్రతిమనిషికీ ప్రేమమీద చాలా గౌరవం వుంటుంది. అహంకారం.. ద్వేషం.. చిరాకు – యిలాంటివన్నీ చెడు లక్షణాలన్న విచక్షణ వుంటుంది. ఆ బలహీనతలని అధిగమించి ప్రేమని మాత్రమే పంచి యివ్వగలిగితే ప్రపంచంలో ఎలాంటి వ్యక్తిని అయినా జయించగలం అన్న నమ్మకం వుంటుంది. కాకపోతే అలా బలహీనతలని అధిగమించలేక... అహాన్ని వదులుకోలేక.. ఎదుటి మనిషిని ప్రేమించలేక అవస్థ పడుతూంటారు. అది బాధే. సమస్యే.

కానీ... కానీ.. ఆ బలహీనతలన్నిటినీ జయించి, తనని కూడా మరచి ఒక మనిషిని ప్రేమిస్తే, అంత గొప్పగా ప్రేమించాక కూడా ఆ మనిషి నిర్లక్ష్యం చేస్తే.. అపుడు ఆ బాధ యింకా దారుణంగా వుంటుంది.

ప్రేమకి లొంగని మనుషులు ప్రపంచంలో వున్నారని తెలిస్తే మనుషులంటేనే భయం వేస్తుంది.

యుద్ధంలో గెలవలేక పోవడం వేరు. గెలిచాక ఓటమి మిగలడం వేరు.

తన "ప్రేమ" ని ఒక వ్యక్తి. . ఎవరో ఎవరో కాదు. . తన మెడలో మంగళసూత్రం కట్టిన వ్యక్తి గుర్తించలేకపోయాడంటే. . అది – ఆ నిజం ఎవరినైనా నిర్వీర్యులని చేస్తుంది. తను నవ్వితే ఎదుటివారు నవ్వుతారనీ. . తను చేయి చాస్తే ఎదుటివారు అందుకుంటారనీ నమ్మకం లేకపోతే మనిషి బ్రతకడం దుర్భరమవుతుంది.

ప్రస్తుతం జయంతి ఆ షాక్ లోనే వుంది.

పిల్లాడు ఏడుస్తున్నా పట్టించుకోని నిర్లిప్తతతో మంచం పట్టీని ఆనుకుని కూర్చుండి పోయింది.

చెల్లెలు పరుగెత్తుకుంటూ లోపలికి వచ్చింది.

"అక్కా! బాబు ఏడుస్తున్నాడు." అంటూ వాడ్ని తీసుకొచ్చి అందించింది.

జయంతి చేతులు అలవాటుగా పిల్లాడిని వడిలోకి తీసుకున్నాయి. చీరని ప్రక్కకి జరిపి వాడి నోటికి గుండెలనందించాయి.

"అక్కా!"

చెల్లెలి పిలుపుకి జయంతి తలతిప్పి చూసింది.

"రేపు కాలేజీలో డిబేటింగ్ వుంది. "జీవితంలో ప్రేమ. . దాని ప్రాముఖ్యత" అని. ఏం మాట్లాడను?"

చాలారోజుల తర్వాత జయంతికి నవ్వొచ్చింది. "నువ్వేమనుకుంటున్నావు?" అంది.

"ఏమో! ప్రేమ అనేది అంత యింపార్టెంట్ విషయంలా తోచదు నాకు. అది జీవితంలో ఒక భాగం కావచ్చు కానీ ప్రేమే జీవితం కాదు కదా! దానికన్నా ముఖ్యమయినవి చాలా వున్నాయి. మంచి వ్యక్తిత్వం. . సమాజంలో గుర్తింపు. . ."

"కాదమ్మా." జయంతి ఖండించింది. "వాటన్నిటికన్నా మనిషికి ప్రేమే ముఖ్యం. గాలీ. . నీరూ. . ఆహారం ఎంత అవసరమో, అవతలి మనిషి ప్రేమ కూడా అంతే అవసరం మనిషికి.

ప్రేమని అందుకోవడం ప్రతిమనిషికీ కనీసపు హక్కు. దాన్ని తిరిగి అందించడం అతని బాధ్యత. నీకు యింకొక పాయింట్ చెప్తాను విను. అప్పు తీర్చని వాడిని ఋణగ్రస్తుడనీ, సహాయాన్ని గుర్తించని వాడిని కృతఘ్నుడనీ అంటాం మనం.

కానీ ప్రేమని గుర్తించని వాడిని! ప్రేమని గుర్తించని వాడిని ఏమీ అనం. అది అవతలి మనిషిని రోజురోజుకీ కృశింపజేసేంత రాక్షసమయిన చర్య అయినా దానికి మనం ఏమీ శిక్ష విధించం.

నిన్ను ప్రేమించని వాడిపట్ల నీ ప్రవర్తన ఎలా వుంటుందనేది నీకు సంబంధించిన విషయం.
వాడిని క్షమిస్తావో! శిక్షిస్తావో! పట్టించుకోకుండా వదిలేస్తావో అది నీ యిష్టం!
కానీ నిన్ను ప్రేమించే వ్యక్తి విషయంలో మాత్రం నీకు ఛాయిస్ లేదు. ఆ మనిషి పట్ల నువ్వు కూడా ప్రేమ చూపి తీరాలి.
నవ్వుతూ నీ దగ్గరకి వచ్చిన మనిషిని చీదరింపుగా చూసే అధికారం నీకు లేదు.
ఒకవేళ.. ఒకవేళ నువ్వలా ప్రవర్తిస్తే దానికి శిక్ష లేకపోవడం కంటే ఘోరం లేదు..."
"అక్కా!" చెల్లెలి మొహంలో ఆశ్చర్యం గమనించి జయంతి నవ్వింది.
"నువ్వేదో అడిగితే నేనేదో చెప్తున్నాననుకుంటున్నావు కదూ!" అంది.
చెల్లెలు అలాగే ఆశ్చర్యం నిండిన కళ్ళతో చూస్తుంటే మళ్ళీ తనే అంది. "లేదు. నీ టాపిక్ కి ఉపయోగపడే పాయింట్సే చెప్తున్నాను. ఇదంతా నువ్వెలా మాటల్లో పెట్టుకుంటావో నాకు తెలీదు కానీ "ప్రేమ ప్రాముఖ్యాన్ని, దాని ఉనికినీ ప్రతిమనిషీ గుర్తించాలి" అని మాత్రం చెప్పు."
ఆ మాటలకి మెచ్చుకోవాలనిపించిందో! లేకపోతే.. తన పెదవులు ఆమె రొమ్ము వదిలి చాలాసేపయినా గుర్తించనందుకు అలిగాడో!.. వడిలోని పాపాయి తన చిట్టి చేతులతో తపతపా ఆమె గుండెలమీద కొట్టాడు.
జయంతి తలత్రిప్పి తనవైపు చూడగానే బోసినోరు తెరిచి హాయిగా నవ్వాడు. రెండు కాళ్ళూ ఆడిస్తూ, కేరింతలు కొడుతూ జయంతి మొహాన్ని అందుకోబోయాడు.
జయంతి కళ్లని సన్నటి నీటిపొర క్రమ్మింది.
"నీకు తెలిసిన ఈ చిన్న విషయం.. ప్రేమకి ప్రతిస్పందించే చాతుర్యం.. మీ నాన్నకి తెలిస్తే ఎంత బాగుండేదిరా!" అనుకుంది.
ఆ భావంతో హృదయం వణికింది. ఒక్క క్షణమే.
మరుక్షణం ఒక స్థిరనిర్ణయంతో అది శక్తిని పుంజుకుంది.
మన ప్రేమకి గుర్తింపు లేని చోట మనం వుండకూడదు. ఎక్కడ మనసు ఎండిపోతుందో అక్కడ అదెంత గొప్ప స్థానమయినా సరే వుండకూడదు.
ఆస్తి.. అంతస్థూ.. హెూదా.. సంఘంలో గౌరవం.. యివన్నీ చాలా చిన్న విషయాలు. వాటిని సంపాదించుకోవడానికి ఒకటి కాదు.. వంద కాదు.. లక్షల మార్గాలున్నాయి.

కానీ.. ప్రేమ.. ప్రేమ వీటన్నిటినీ మించిన అవసరం. ఒకసారి దాన్ని సమూలంగా కోల్పోతే మళ్ళీ పొందలేం. అది ఆఖరి బొట్టు వరకూ ఆవిరయ్యేలా హృదయాన్ని మండబెడితే.. యిక అక్కడ మళ్ళీ ప్రేమ పూరదు.

అందుకే.. ప్రేమకు ప్రతిస్పందన లేకపోతే మనసును బలహీన పరచుకోకూడదు. ప్రేమను ఉపసంహరించుకోవాలి. అక్కడినుంచి మౌనంగా నిష్క్రమించాలి. మిగతా ప్రపంచం వైపు దృష్టి సారించాలి. మరొకరిని ప్రేమించేందుకు ప్రయత్నించాలి...

ఆలోచనలలో కొట్టుకుపోతున్న జయంతి కళ్లలోకే తదేకంగా చూస్తున్న చెల్లెలికి ఏమర్థమయిందో!

"అక్కా! నువ్వు యింక బెంగుళూరు వెళ్ళవు కదా!" అంది కళ్ళు పెద్దవి చేస్తూ.

హాయిగా నవ్వింది జయంతి. చెల్లెలి భుజం చుట్టూ చేయి వేసి దగ్గరికి తీసుకుంటూ "అవునమ్మా! ఇక వెళ్ళను." అంది.

*****